నేడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: నగరంలో పునరుద్ధరించిన రెండు అన్న క్యాంటీన్లను సోమవారం రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణ, అనంతరం కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్యతో కలిసి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు.



- మద్యం లేదంటూ దుకాణాల్లో డిస్‌ప్లే బోర్డులు
- ఉన్న సరుకును బార్లకు తరలిస్తున్నారని ఆరోపణలు
- విధులకు హాజరు కాకుండా సిబ్బంది కాలయాపన



నో స్టాక్..!

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 22: మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది సరుకు లేదంటూ చేతులెత్తేస్తున్నారు. కోరిన బ్రాండు దేవుడెరుగు ఉన్నదేదో ఇవ్వండని అడిగినా లేదని చెబుతున్నారు. అయితే సరుకును బార్లు, బెల్టు షాపులకు తరలిస్తూ దందా చేసుకుంటున్నారని మద్యంప్రియులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలుకు ప్రభుత్వ కసరత్తు చేస్తోంది. అక్టోబరు ఒకటి నుంచి కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి, పాత పద్ధతిలో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఇక మద్యం దుకాణాలు ఉండేది తక్కువ రోజులేనని ఆలోచనతో అక్కడ ఉన్న సిబ్బంది చేతి వాటం చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కొద్ది రోజులుగా నో స్టాక్..

జిల్లాలో 82 ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎలైట్లలో కొద్ది రోజులుగా మద్యం దొరకడం లేదు. మందు బాబులకు కావాల్సిన బ్రాండ్లు లేవని సిబ్బంది చెబుతున్నారు. డిస్‌ప్లే పెట్టిన బ్రాండ్లు మాత్రమే లభిస్తాయని, బీర్లు అసలే లేవంటూ సమాధానం ఇస్తున్నారు. ఏమీ లేనప్పుడు దుకాణాలు మూసేస్తే సరిపోతుంది కదా అంటూ మందు బాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ షాపులు ఉండేది నెలాఖరు వరకు మాత్రమేనని, అందుకే పై నుంచి అధికారులు పెద్దగా బ్రాండ్లు పంపించడం లేదని కూడా చెబుతున్నారు. మందు బాబులు చేసేది లేక బార్లకు వెళ్లి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే జిల్లా ఎక్సైజ్ అధికారుల మాత్రం మద్యం కొరత లేదని చెబుతున్నారు. దుకాణాలకు పూర్తి స్థాయి సరఫరా చేస్తున్నామని తెలపడం గమనార్హం.



బార్లు, బెల్టు షాపులకు సరుకు తరలింపు..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది తమకు ఉన్నది వారం రోజులే కదా దందాకు తెగబడినట్లు తెలుస్తోంది. బీర్లు, బాగా డిమాండ్ ఉన్న బ్రాండ్ల మద్యాన్ని బార్లు, బెల్టు షాపులకు తరలిస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇక దుకాణాల్లోని సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఇబ్బందికరంగానే ఉంటోంది. మందుబాబులపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షణ విధుల్లో ఉండాల్సిన సమయంలో కొందరు ఉద్యోగులు.. అధికారుల అనుమతి తీసుకోకుండా బయట తిరుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ఉన్న బ్రాండ్లు ఇస్తాం, లేనివి ఇవ్వలేం

డిమాండ్ ఉన్న బ్రాండ్లు వెంటనే ఖాళీ అవుతుంటాయి.. వస్తుంటాయి. అది నిరంతర ప్రక్రియ. అందులో లేనివి ఇవ్వలేం. ఎక్కడైనా స్టాక్ లేదంటే చెప్పండి సరఫరా చేస్తాం. ఒక్కొక్క షాపులో దాదాపు 130 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి.

- సుధీర్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

సీమ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తా
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీమ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం సందర్శనలో భాగంగా ఆదివారం కర్నూలుకు చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి నిమ్మల రామానాయుడును మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కలిసి జిల్లాలోని అసంపూర్తి, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇచ్చి తక్షణం పనులు చేపట్టాలని విన్నవించారు. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని కోరారు. అలగనూరు జలాశయం మరమ్మతులు తక్షణం చేపట్టాలని, హంద్రీనీవా నుంచి చెరువులకు నింపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత విన్నవించారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో 77 చెరువులకు హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టు నిర్వహణకు సిబ్బంది, నిధులు ఇవ్వాలని, పందికోన జలాశయం కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులకు రూ.200 కోట్లు ఇవ్వాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కోరారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణకు నిధులు ఇవ్వాలని, గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనుల బకాయిలు చెల్లించాలని, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు చేపట్టాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి విన్నవించారు. కేసీ కాలువ, సుంకేసుల బ్యారేజీ, క్రస్ట్‌గేట్ల మరమ్మతులు చేట్టాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు. ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేసిన వేదవతి ప్రాజెక్టు, భూ సేకరణకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత బి.వీరభద్రగౌడ్ వినతి పత్రం ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడుకు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ జ్ఞాపిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు, మంత్రాలయం టీడీపీ సీనియర్ నేత ఎన్.రాఘవేంద్రరెడ్డి, ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర తదితరులు కలిశారు.



మంత్రి నిమ్మల రామానాయుడుకు మెమెంటో అందజేస్తున్న టీజీ



మంత్రిని సన్మానిస్తున్న ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్ బాషా తదితరులు

● మంత్రిని సత్కరించిన ఇంజనీర్లు: హంద్రీనీవా ప్రాజెక్టు సందర్శన కోసం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆ శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరావు జిల్లాకు వచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, హంద్రీనీవా అనంతపురం జిల్లా సీఈ నాగరాజు, ఎస్ఈ రాంగోపాల్, కర్నూలు ఇగిరేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ తదితరులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు. జిల్లా ప్రాజెక్టుల తాజా పరిస్థితిపై మంత్రికి వివరించారు.

కొత్తూరులో న్యాయాధికారి పూజలు



న్యాయాధికారిని సత్కరించిన ఆలయ సిబ్బంది

పాణ్యం, సెప్టెంబరు 22: మండలంలోని కొత్తూరు దేవస్థానంలో ఆదివారం కర్నూలు జిల్లా న్యాయాధికారి జి.కబర్ది పూజలు నిర్వహించారు. న్యాయాధికారికి ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది న్యాయాధికారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, ఏఎస్ఐ రఫీక్, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, పోలీసు సిబ్బంది, నంద్యాల కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కే బీమా

- రబీ నుంచి ప్రీమియం చెల్లించాల్సిందే
- జిల్లా కేంద్రానికి చేరిన ఉత్తర్వులు
- ఇదేమి దారుణమంటున్న రైతు సంఘాలు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వివిధ పంటలకు సంబంధించి ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదు చేసి ఈకేవైసీ చేయించుకుంటేనే ఉచిత పంటల బీమా వర్తిస్తుందని, పంట కోత ప్రయోగాల ఆధారంగా పరిహారం లభిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరికి హెక్టారుకు రూ.లక్ష బీమాను ఖరారు చేశారు. వాతావరణ ఆధారిత బీమా కింద కర్నూలు, నంద్యాల జిల్లాలో పత్తి, వేరుశనగలను నోటిఫై చేశారు. అలాగే వాతావరణ బీమా అమలుకు రిస్క్ పీరియర్ వేరుశనగ పంటకు, పత్తికి అమలు చేశారు. కర్నూలు జిల్లాలో గ్రామం యూనిట్‌గా వరిని, మండలం యూనిట్‌గా కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం పంటలను గుర్తించారు. నంద్యాల జిల్లాలో బీమా అమలును గ్రామం యూనిట్ వరిని, మండల యూనిట్‌ను మొక్కజొన్న, కంది, మినుము, ఎండు మిర్చిని గుర్తించారు. జిల్లా యూనిట్‌గా జొన్న, సజ్జ, కొర్ర పంటలకు అమలు చేశామని జేడీ వరలక్ష్మి తెలిపారు.

● రైతు సంఘాలు ధ్వజం: పంటల బీమా పథకంలో భాగంగా రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని ఖరీఫ్ పంటలకే వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. రబీలో రైతులు సాగు చేయనున్న పంటలకు సంబంధించి రైతులు తమ వంతు ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లించదని, రైతులే చెల్లించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు దశాబ్ద కాలంగా రైతులు ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు తెగుళ్ల కారణంగా పంటలు కోల్పోయారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ వరకే రైతుల తరుపున ప్రీమియం చెల్లిస్తామని ప్రకటించడం దారుణమని, రబీలో సాగు చేసిన పంటలకు రైతుల తరపున ప్రీమియం చెల్లించాల్సిందేనని, లేకపోతే భారీ ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.





కోనసీమలా కోసిగి

కోసిగి, సెప్టెంబరు 22: కోసిగి, పెద్దకడుబూరు మండలాల్లోని పలు గ్రామాలు కోనసీమను తలపిస్తున్నాయి. పచ్చని పైర్లు, పంట పొలాల మధ్య ఉన్న చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కోసిగి మండల పరిధిలోని తుంగభద్ర నదికి సమీపంలో ఉన్న ప్రాంతంతో పాటు పెద్దకడుబూరు మండలం నేమకల్లు, పెద్దతుంబళం గ్రామం మధ్యలో ఉన్న పచ్చని వరి పైర్లు, పొలాల గట్లపై ఉన్న తాటి చెట్లు కనువిందు చేస్తున్నాయి. అలాగే సాతనూరు పంప్ హౌస్ వద్ద టెంకాయ చెట్లు కోనసీమ అందాలను గుర్తుస్తున్నాయి.




నేమకల్లు గ్రామ సమీపంలో కోనసీమ అందాలను తలపిస్తున్న వరిపైర్లు, మధ్యలో తాటి చెట్లు



పెద్దకడుబూరు మండలం నేమకల్లు వద్ద పచ్చని వరిపైర్ల మధ్య తాటి చెట్లు

శ్రీశైలానికి 15,487 క్యూసెక్కులు



శ్రీశైలం, సెప్టెంబరు 22: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఆదివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగింది. జూరాల నుంచి 15,487 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 876.30 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీ లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 169.4655 టీ.ఎమ్.సీ లుగా నమోదయింది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల చేశారు.



మంత్రి రామానాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి టీజీ భరత్

ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిసిన నాయకులు

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చారు. స్టేట్‌గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలతో పాటు మంత్రాలయం, ఆలూరు, కర్నూలు ఎంపీ, నాయకులు కలిసి సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ పనులను పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో హంద్రీనీవా కాల్వద్వారా చెరువులకు నీళ్లు నింపి ప్రజలు, రైతుల త్రాగు, సాగు నీటి అవసరాలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు.





మంత్రితో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి











మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసిన ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకుడు తుగ్గలి నాగేంద్ర, కలెక్టర్ రంజిత్‌బాషా, వీరభద్రగౌడ్

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 22: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు చిన్న రామాంజనేయులు(37) ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. గూడూరు పట్టణం కొండిగేరికి చెందిన రైతు చిన్న రామాంజనేయులుకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 4 ఎకరాల సొంత పొలంతో పాటు, 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, ఇతర పంటలను సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సరిగా పండక దాదాపు రూ. 8లక్షల వరకు అప్పులు చేసాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతూ ఈ నెల 20వ తేదిన పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యుల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ అంజనేయులు తెలిపారు. బాధిత రైతుకు ప్రభుత్వం ఆదుకోవాలని పరిహారం ఇవ్వాలని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, జింకల కుమార్ కోరారు.

అప్పుల బాధతో పెయింటర్ ...

కర్నూలు, సెప్టెంబరు 22: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బోయ కర్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం మానవపాడు చెందిన కర్ణ ఏడేళ్ల కింద కుటుంబంతో సహా వచ్చి పెయింటింగ్ పని చేస్తుండేవాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం ఉన్నారు. పెయింటింగ్ పని కోసం రూ.5 లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక తరచూ బాధపడుతుండేవాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆసుపత్రి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమ బెంగాల్ వాసి..

కర్నూలు, సెప్టెంబరు 22: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సప్తగిరి నగర్‌లో ఉంటున్న పశ్చిమ బెంగాల్ వాసి సనాతన్ లాహోర్ (19) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన సనాతన్ లాహోర్, కర్మాకర్, మరి కొంత మంది యువకులు కర్నూలుకు పెయింటింగ్ పని కోసం వచ్చారు. స్థానిక సప్తగిరి నగర్‌లో పెయింటిగ్ పని చేసే ఇంట్లోనే ఉంటున్నారు. తాను ప్రేమించిన యువతి ఆత్మహత్యయత్నం చేసిందని, ఆమె చావుబతుకుల మధ్య ఉందని శనివారం రాత్రి సనాతన్ లాహోర్ మనోవేదనకు గురైనట్లు తెలుస్తోంది. ఆదివారం మిగతా వారు పనికి వెళ్లి.. తిరిగి వచ్చేసరికి సనాతన్ ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళిధర్ రెడ్డి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన జక్కా మదుసూధన్‌రావు (48) రైలు కట్టపైకి వెళ్లి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నంద్యాల రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో డీఈఈ, ఏఈఈల బదిలీలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: గ్రామీణ నీటి సరఫరా అండ్ పారిశుధ్య విభాగం ఉమ్మడి జిల్లాలో డీఈఈ, ఏఈఈలకు సంబంధించి బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవ్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె డీఈఈ ఉమాకాంతరెడ్డిని అదే జిల్లా ఆత్మకూరుకు, ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో పని చేస్తున్న డీఈఈ కడియాల శ్రీనివాసులును నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు, ఆదోని డీఈఈ శివనాగేశ్వరావును హిందూపురం జిల్లా పెనుగొండకు, కర్నూలు సబ్ డివిజన్ డీఈ మోయినుద్దీన్‌ను మంత్రాలయంకు, కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డిని నంద్యాల జిల్లా డోన్‌కు, అనంతపురం క్వాలిటీ కంట్రోల్ డీఈ కుషికుమార్‌రెడ్డిని కర్నూలు క్వాలిటీ కంట్రోల్‌కు, ఎమ్మిగనూరు డీఈ సాంబయ్యను ఆదోనికి, ఆత్మకూరు డీఈ జి.శ్రీనివాసులను కోడుమూరుకు, నందికొట్కూరు-2 ఎం. విద్యాసాగర్‌ను ఎమ్మిగనూరుకు, నందికొట్కూరు-1 అమలను కర్నూలు సబ్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లాలో ఏఈఈల బదిలీలు నిర్వహించారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం



స్వర్ణ రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, సెప్టెంబరు 22: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ధార్మిక పర్యటన ముగించుకొని పీఠాధిపతి శ్రీమఠానికి చేరుకున్నారు. ఆదివారం పంచమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు, వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి, పీఠాధిపతి మహా మంగళ హారతులు ఇచారు. రథంపై నుంచి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. అంతకు ముందు పీఠాధిపతి మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములకు స్వర్ణ నాణేలతో అభిషేకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులను పీఠాధిపతి ఆశీర్వదించారు. ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

పర్యాటక రంగంపై పోటీలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భాన్ని పురష్కరించుకొని ఈనెల 27వ తేదీ విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, పెయుంటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటకం, శాంతి అనే అంశం, వక్తృత్వ పోటీ, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ప్రపంచ, భారత్, ఆంధ్రప్రదేశ్ టూరిజంలపై క్విజ్ నిర్వహించడం తోపాటు విద్యార్థులు, యువకులకు ఒక నిమిషం నిడివి గల వీడియో ఉండాలని అన్నారు.. అలాగే జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకునే 15 నుంచి 20 సెకండ్ల నిడివితో రీల్స్ వీడియోలు రూపొందించి సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీటిలో ఉత్తమంగా ఎంపిక కాబడిని వాటికి 27న ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. ఈ నెల 26 వతేదీ నాటికి టూరిజం వీడియో, రీల్స్ సమర్పించవలిసి ఉంటుందని జిల్లా పర్యాటక అధికారి తెలిపారు.

పీఆర్ ఇంజనీర్ల బదిలీలు

కర్నూలు పీఆర్ ఎస్‌ఈగా వి. రామచంద్రారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ రాజ్ విభాగంలో డీఈఈ, ఏఈఈల బదిలీలు నిర్వహించారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో పని చేస్తున్న వి.రామచంద్రారెడ్డిని కర్నూలు పీఆర్ ఎస్‌ఈగా నియమించారు. కర్నూలు ఎస్‌ఈగా పని చేస్తున్న ఎస్‌ఈ సుబ్రమణ్యం జూన్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి నంద్యాల ఈఈ రామ్మోహన్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా రామచంద్రారెడ్డిని కర్నూలు ఎస్‌ఈగా నియమించారు. దీంతో పాటు సీఆర్‌డీలో పని చేస్తున్న డీసీ వెంకటేషను ఆదోని ఈఈగా, పీఐయూ ఈఈ రామక్రిష్ణారెడ్డిని తూర్పు గోదావరి జిల్లా అమలాపురం ఈఈగా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఎం.వెంకటసుబ్బారెడ్డిని ఇక్కడే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసర రెడ్డి కూడా సీఈఓగా ఇక్కడే కొనసాగేవిధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా అధికారుల బదిలీ

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: జిల్లాలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. జిల్లా నూతన డీఆర్‌డీఏ పీడీగా ప్రతాప్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిగా రామ్‌నాథ్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్‌గా నాగసుధ నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ సలాంబాషా సంబంధిత డిపార్టుమెంటులో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తున్న నాగరాజు నాయుడు అనంతపురం జిల్లా డీపీవోగా నియమితులయ్యారు. జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్‌గా పని చేస్తున్న షర్మిళ విజయవాడకు బదిలీ అయ్యారు. అదేవిధంగా జిల్లాలోని గ్రేడ్-1 గ్రేడ్-2లు 300 మంది వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి 4 వరకు 126 మంది, గ్రేడ్-5లు 151 మంది, గ్రేడ్-6 కింద 75 మంది బదిలీ అయ్యారు.

యువకుడి దారుణ హత్య

- రంగంలోకి దిగిన పోలీసులు
- జాగిలంతో దర్యాప్తు ముమ్మరం

గూడూరు, సెప్టెంబరు 22: ఆదివారం తెల్లవారుజామున జరిగిన రవి అనే యువకుడి దారుణ హత్యతో గూడూరు జనం ఉలిక్కిపడ్డారు. యువకుడి హత్యకు కారణం.. ప్రేమ వ్యవహారమా లేక వివాహేతర సంబంధమా అనేది విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు అంటున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు పోలీసు జాగిలం, ఫింగర్ ప్రింట్స్ బృందాన్ని రప్పించి దర్యాప్తును ముమ్మరం చేసారు. గూడూరులోని మూలగేరికి చెందిన చిన్న మద్దిలేటి, మద్దమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. వారి కుమారుడు రవి ఆదివారం తెల్లవారు జామున ఇంటి సమీపంలో ఆర్ కానాపురం వెళ్లే రహదారిలో ఉన్న కల్లందొడ్డిలో ఎద్దులకు మేత వేసేందుకు వెళ్లాడు. అక్కడ మాటుగాచిన గుర్తు తెలియని వ్యక్తులు ఒక్క సారిగా రవిపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న యువకుడు రవిని అటు వైపు వెళ్ళిన వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు తరలించారు. అయితే అప్పటికే రవి మృతి చెందాడు. గూడూరు ఎస్ఐ తిమ్మయ్య పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఈ హత్యకు కారణం తెలియాల్సి ఉందని అన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. సంఘటనపై సమగ్రంగా విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య వెల్లడించారు. యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



రవి (ఫైల్)

శ్రీశైలంలో మరొకరు..

శ్రీశైలం, సెప్టెంబరు 22: శ్రీశైలం పరిధిలోని పాతాళగంగ రోడ్డుమార్గంలో శనివారం అర్ధరాత్రి ఆవుల అశోక్ కుమార్(32)ను హత్య చేశారు. వివరాలివీ.. దేవస్థానం డార్మిటరీ వెనుకభాగం సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి మార్కాపురానికి చెందిన ఆవుల అశోక్ అనే వ్యక్తిని గాజు సీసాతో గొంతు కోశారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్‌ను స్థానికులు, పోలీస్ సిబ్బంది హుటాహుటీన 108 అంబులెన్స్‌లో సుండిపెంట ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది పరీక్షించి అశోక్ కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. హంతకులు దేవస్థానం పరిధిలో భక్తులకు విభూతి బొట్లు పెట్టి జీవనం సాగించేవారిగా గుర్తించారు. అశోక్‌కుమార్ వారం రోజుల క్రితం బేల్దారి పనుల నిమిత్తం శ్రీశైలం వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోనికి తీసుకుని, ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి సీఐ జి.చంద్రబాబు సిబ్బందితో కలిసి పరిశీలించారు.

లక్ష మందితో సభ నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఏపీ వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కల శ్రీనివాస్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం త్వరలో లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల శ్రీనివాసులు, క్రాంతి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్‌లోని వాల్మీకి, బోయల ఎస్టీ అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వాలని గత వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్, బాలమద్దిలేటి, తలారి కృష్ణ, శివ, సత్రం రామకృష్ణ, రవి, పెద్దయ్య నాయుడు పాల్గొన్నారు.

ఇరువురిపై కట్టెలతో దాడి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 22: మండలంలోని తూడిచర్ల గ్రామంలో ఆదివారం ఉదయం ఎల్లపుల్లయ్య, నవీన్ అనే వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు కట్టెలతో దాడి చేశారు. ఎల్లపుల్లయ్య, ఈడిగె శేఖర్‌గౌడులు కేసీ కాల్వ నీటిని మళ్లించే విషయమై మూడు రోజుల గొడవ పడ్డారు. ఆదివారం ఎల్లపుల్లయ్య, నవీన్ కలిసి శేఖర్‌గౌడు ఇంటి ముందు నుంచి వెళ్తున్నారు. శేఖర్ గౌడు వారిని దుర్భాషలాడాడు. అంతటితో ఊరుకోకుండా శేఖర్‌గౌడుతోపాటు శంకర్‌గౌడు, నాగేంద్రగౌడు, వెంకటేష్‌గౌడు, మహేష్‌గౌడు, ధనుంజయగౌడు అనే ఆరుగురు కలిసి వారిపై కట్టెలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

డీజీపీవో, డీఎఫ్‌వోల నియామకం

నంద్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు నూతన డీజీపీవో (జిల్లా గ్రామ పంచాయతీ అధికారి), డీఎఫ్‌వో (జిల్లా ఫారెస్టు అధికారి)ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. షేక్ జమీఉల్లాను నంద్యాల డీజీపీవోగా నియమించగా, అన్నమయ్య జిల్లాలో డిప్యూటీ కన్సర్వేటర్‌గా పనిచేస్తున్న ఫారెస్టు అధికారిని నంద్యాల డీఎఫ్‌వోగా నియమించింది.

జగనన్న కాలనీలో దొంగ పట్టివేత

మద్దికెర, సెప్టెంబరు 22: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులోని జగనన్న కాలనీలో ఆదివారం తెల్లవారుజామున దొంగను స్థానికులు పట్టుకున్నారు. ఓ ఇంట్లో జొరబడుతుండగా మహిళలు గమనించి కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై దొంగను పట్టుకున్నారు. అయితే దొంగను పట్టుకునే సమయంలో స్థానికులపై దొంగ రాళ్ల దాడికి పూనుకున్నాడు. కాలనీలోని యువకులు ఆ దొంగను పట్టుకుని స్థంభానికి కట్టేసి పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వచ్చి స్థానికులు పట్టుకున్న దొంగను తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో వారి పేరు దీన్ దయాల్ అని, తనది ఒడిస్సా అని, ఇక్కడ పనులు చేసుకోవాలని వచ్చామని తెలిపాడు. ఎస్ఐ విజయకుమార్ ఆ దొంగను ఆదోనికి తరలించి అక్కడ వేలిముద్రలు సేకరించి ఒడి స్సాకు పంపిస్తామని తెలిపారు.

నీటి కుక్కల సంచారం



నీటి కుక్క

రుద్రవరం, సెప్టెంబరు 22 : మండలంలోని పాత వెలగలపల్లె వంకలోనీటి కుక్కలు కనిపించాయని స్థానికులు ఆదివారం సాయం త్రం తెలిపారు. గతంలో ఎన్నడూ కనిపించలేదన్నారు. సుమారు నాలుగు నీటి కుక్కలు నీటిలో వెళ్తుండగా చూశామని తెలిపారు. మొదటగా కొంత ఆందోళనకు చెందినా నీటి కుక్కలు ప్రజలకు హానీ చేయవని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. వాగు వెంట గట్టుపై ఎక్కడం, నీటిలో దూకడం కనిపించాయని స్థానికులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

పశుసంవర్థక సహాయకుల రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబు పిలుపు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 22: సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పశుసంవర్థక శాఖ సహాయకుల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు రాజేష్‌బాబు అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎన్జీవో హోంలో జిల్లా పశుసంవర్థక శాఖ సహాయకుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబుతో పాటు ప్రధాన కార్యదర్శి విజయ నాయక్, కోశాధికారి మంజునాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబు మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ సహాయకులు శాఖకు సంబంధించిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారని అన్నారు. అందువల్ల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఉత్తర్వుల మేరకు ఏహెచ్‌ఏలకు ఇతర శాఖలకు సంబంధించిన పనుల గురించి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలిగా నాగవాసవి, కార్యదర్శిగా సురేష్ కుమార్, గౌరవాధ్యక్షులుగా వెంకటేశ్, కోశాధికారిగా భూపతి, ఉపాధ్యక్షులుగా సురేష్ బాబు, సుశీల, సంపత్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శరత్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణి, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా సుధాకర్ వ్యవహరించారు.

వ్యక్తిపై దాడి

కర్నూలు, సెప్టెంబరు 22: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాలిక్ అనే వ్యక్తిపై బషీర్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బనగానపల్లె మండలం వీరాపురం గ్రామానికి చెందిన మాలిక్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పార్వతి నగర్ సర్వీసు రోడ్డు వద్ద మాలిక్ బాషా, బషీర్ మధ్య గొడవ జరిగింది. లోడు తీసుకుని వెళ్లే సమయంలో ఒకరితో ఒకరు ఘర్షణ పడ్డారు. బషీర్ తల్లి మాలిక్‌బాషాను పట్టుకోగా.. బషీర్ కత్తితో కడుపులో పొడిచాడు. చుట్టుపక్కల వారు రావడంతో తల్లి, కొడుకులు ఇద్దరు పరారయ్యారు. స్థానికులు మాలిక్‌బాషాను ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర హోం శాఖ కార్యదర్శిని కలిసిన నంద్యాల ఎంపీ



కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవిందుమోహన్‌కు లడ్డూను అందజేస్తున్న ఎంపీ శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 : ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద మోహన్‌ను నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డా. బైరెడ్డి శబరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి శేష వస్త్రం, స్వామి, అమ్మవార్ల ఫొటో, లడ్డూను ఆయనకు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖలో ఏపీకి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిష్కరించేందుకు సహకరించాలని ఎంపీ శబరి కోరారు.

సంతానలేమికి ఆధునిక చికిత్సలు

- ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డా. ఆశా అనిల్ బక్షి
- ముగిసిన సదస్సు... హాజరైన 460 మంది వైద్యులు



సీనియర్ ఇన్‌ఫెర్టిలిటీ వైద్యురాలు డా.వీటీ సీతాను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 22: పెళ్లయి రెండు, మూడేళ్ల దాటిపోయినా సంతానం కలగని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతిలో సక్సెస్ రేట్ ఉంటుందని ఇండియన్ సొసైటీ అసిస్టెంట్ రీప్రొడెక్షన్ (ఐఎస్ఏఆర్) జాతీయ కార్యదర్శి డా. ఆశా అనిల్ బక్షి అన్నారు. నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సులో ఆమె పాల్గొన్నారు. 35 లేదా అంత కంటే తక్కువ వయస్సు ఉన్న మహిళల్లో 40 శాతం, 38 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారిలో సక్సెస్ రేటు 23 శాతం ఉంటుందన్నారు. ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.విష్ణుప్రియ మాట్లాడుతూ ఏఆర్‌టీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.డి.విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు డా.శిరీషారెడ్డి, డా. శ్రావ్య, రాష్ట్ర అధ్యక్షురాలు డా.పద్మలత, కర్నూలు గైనిక్ సొసైటీ అధ్యక్షుడు డా. వెంకటరమణ పాల్గొన్నారు.

చంద్రబాబు వంద రోజుల పాలన సక్సెస్

కార్మికుల ధర్నాలను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: దేశవ్యాప్తంగా జరిగే కాంట్రాక్టు కార్మికులు ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 30న చేపడుతున్న ధర్నాకు తరలిరావాలన్నారు. సమావేశంలో సాయిబాబ, నాగేశ్వరావు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (న్యూసిటీ), సెప్టెంబరు 22: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. ఆదివారం 12వ వార్డులో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీఎం సమావేశానికి మేయర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ నగరంలో సోమవారం జరిగే అఖిల భారత మేయర్ల మండలి(ఏఐసీఎం) కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు నగర మేయర్ బీవై. రామయ్య ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఏఐసీఎం జాతీయ అధ్యక్షురాలు అతుల్‌పటేల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుడు హోదాలో మేయర్ పాల్గొనున్నారు. సమావేశంలో ఏఐసీఎం రాష్ట్ర స్థాయి కమిటీల ఏర్పాటు, మేయర్లకు శిక్షణ తరగతులు, కార్యాలయ పునరుద్దరణ వంటి 9 అజెండాలతో పాటు ఇతరత్రా అంశాలపై చర్చఉంటుంది.

25న రగ్బీ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 22: స్థానిక ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో ఈ నెల 25న ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్, కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. విజేతలకు ట్రోఫీలతోపాటు మెడల్స్ బహూకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ అండర్-9 బాలికల రగ్బీ జట్టుకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు సీ.హర్షవర్ధన్ చెప్పారు. వివరాలకు 9393827585ను సంప్రదించాలని కోరారు.

సామూహిక పారాయణం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 22: తిరుపతి లడ్డూ కలుషితమైనందుగాను విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు స్థానిక గాంధీనగర్‌లోని ఆదివారం 800 మంది భక్తుల చేత సామూహికంగా పారాయణం చేశారు. వరసిద్ధి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీషిరిడీ సాయిసత్సంగం ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి నామావళిని పఠించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహాబలేష్, సుదర్శన్, కోదండ స్వామి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: ప్రభుత్వ మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జటోతు హుశేన్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల కూడా సానుకూలంగా నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామరాజు, వెంకటేశ్, ప్రశాంత్, విజయ్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ కౌన్సెలింగ్

కల్లూరు, సెప్టెంబరు 22: జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీల ప్రక్రియ ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన బదిలీలు ప్రహసనంలా సాగాయి. కర్నూలు జిల్లా వెంకటరమణ కాలనీలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో చేపట్టిన బదిలీల కౌన్సెలింగ్‌కు రాయలసీమ జోన్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌లు సీనియర్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఆదివారం చేపట్టిన బదిలీల కౌన్సిలింగ్‌లో ముందుగా సబ్ రిజిస్ట్రార్లు అనంతరం సీనియర్ అసిస్టెంట్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రాయలసీమ రీజియన్ పరిధిలోని నలుగురు డీఐజీల సమక్షంలో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యంగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు. బదిలీల జాబితాను సోమవారం విడుదల చేయనున్నట్లు సమాచారం.

కర్నూలు కార్పొరేషన్ ఎస్ఈగా రాజశేఖర్

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్పొరేషన్ ఎస్ఈగా జి.రాజశేఖర్‌ను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నెల్లూరు జిల్లా ఏపీ టిడ్కో ఎస్ఈగా పని చేస్తున్నారు. ఈయన స్థానంలో కర్నూలు ఎస్ఈ వేణుగోపాల్‌ను నెల్లూరు ఏపీ టిడ్కో ఎస్ఈగా బదిలీ చేశారు. కర్నూలు కార్పొరేషన్ ఈఈగా పని చేస్తున్న ఎండీ షాకీర్ హుసేన్‌ను అనంతపురం మున్సిపాలిటీ ఈఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ధర్మవరం మున్సిపల్ ఈఈ సత్యానారాయణను నియమించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ డిప్యూటీ ఎస్ఈ సురేష్ కుమార్‌ను కుడా ఈఈగా నియమించారు. అలాగే కర్నూలు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఈవోగా ఎం.విజయరాజును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌జీ వెంకటేశ్‌ను విజయవాడ హెడ్ ఆఫీసుకు బదిలీ చేశారు.

నగర పాలక అడిషనల్ కమిషనర్ బదిలీ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22:నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్‌ను అనంతపురం నగర పాలక అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గ్రేడ్-1 కమిషనర్‌గా పని చేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆర్‌జీవి.క్రిష్ణను కర్నూలు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. దీంతో పాటూ నగర పాలకంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ప్రసాద్‌గౌడును డోన్ మున్సిపాలిటీ కమిషనర్‌గా, గ్రేడ్-2 స్థాయిలో కమిషనర్‌గా పని చేస్తూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎం.క్రిష్ణను ఆదోని మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమించారు. ఈ మేరకు ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటలతోనే మానసిక ఉల్లాసం

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 22: విద్యార్థులకు ఆటలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు టీజీ వెంకటేశ్ అభినందించి బెల్టులు ప్రదానం చేశారు.

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



కాల్వ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, సెప్టెంబరు 22: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలన సక్సెస్ అయిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు విజయవంతంగా పూర్తి కావడంతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని కాల్వ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌కు గ్రామ నాయకలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలో మొక్కలు నాటారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల స్టిక్కర్లను అతికించారు. అనంతరం గ్రామ సభలో గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిందన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయిందని, చంద్రబాబు అభివృద్ధిని వేగవంతం చేస్తున్నారని అన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5లకే భోజనం పెడుతూ మూడు పూటలు కడుపులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్, తహసీల్దార్ వెంకటరమణ, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, ఎంఈవో ఓంకార్ యాదవ్, నాయకులు ఖాదర్ బాషా, రజాక్‌బాషా, గోవిందరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్ రావు, మహబూబ్ బాషా, కేవీ మధు, చింతలపల్ల వెంకటరమణ, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, అడ్వకేట్ నాగముణి, శ్రీరాములు, లక్ష్మీకాంతరెడ్డి, శాలుమియా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభివృద్ధే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి. బెళగల్, సెప్టెంబరు 22: ప్రజాభివృద్దే టీడీపీ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాత బస్టాండు ఆవరణలో మండల కన్వీనర్ గోవిందుగౌడు అధ్యతన టీడీపీ ప్రభుత్వం వందరోజులలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. దశలవారిగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, ఈవోఆర్డ్ సందీప్, తహసీల్దార్ విజయశ్రీ, సర్పంచ్ పాండురంగన్న, నాయకులు తిమ్మప్ప, భీమన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

మండల కేంద్రంలో ఉన్న కొండపోరంపోకు భూములను కాపాడాలని టీడీపీ మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, విష్ణుసేనయూనియన్ నాయకుడు భీమన్న, గఫూస్, బాలాజీవెంకటేశ్ తదితరులు ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు మాట్లాడుతూ సి.బెళగల్‌లో ఉన్న 355, 426 సర్వే నంబరు కొండపోరంబోకు భూములను వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్నారని అన్నారు. అనుమతి లేకుండా ఇండ్లు కట్టుకొని, గుడిసెలు వేసుకున్న వారందరికీ నోటీసులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజి వెంకటేశ్, భీమన్న, రాజు, రవి, బుడ్డన్న, గఫూస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భగవద్గీత ఉన్నత గ్రంథం

● పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్



భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 22: భగవద్గీత సృష్టిలో అత్యంత ఉన్నతమైన గ్రంథమని మంత్రి టీజీ భరత్ అన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇండస్ మాంటిస్సోరి విద్యా సంస్థలలో భగవద్గీత పుస్తకావిష్కరణ చేసి విద్యార్థులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా విశ్రాంత సర్వోన్నతాధికారి కుమావత రామశంకర్ నాయక్, జిల్లా విశ్రాంత వైద్యాధికారి డా.పూజారి మోక్షేశ్వరుడు, ఇండస్ మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేఎస్‌వీ రాజశేఖర్, బీఎం మీనాక్షి, పి.విల్సన్, అగస్టీన్ శ్రీనివాసులు రెడ్డి, కామేశ్వరి, మధుసూదన్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, ధర్మప్రచార మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి, మారం నాగరాజు గుప్త, ఆవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గీతారత్న పురస్కార గ్రహీతకు సన్మానం

● భగవద్గీత ప్రచార సంఘం అధ్యక్షుడు డా.వి.రమణ ధార్మిక సేవ ప్రశంసనీయని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం వివిధ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో గీతారత్న పురస్కారంతో సన్మానించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ఆవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు, గోదాగుకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం తదితరులు వారి సేవలను కొనియాడారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 22: నగరంలోని పలు వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని బంగారుపేటలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమం అనంతరం కమిషనర్ రవీంద్రబాబు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు తెలిపిన రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, ప్యాచ్ వర్కులు, పారిశుద్యం పనులకు సంబంధించి స్థానికులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగర పాలక సంస్థ అధికరులను ఆదేశించారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



కొళాయిలను పరిశీలిస్తున్న జాటోత్ హుశేన్ నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22: గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుశేన్ నాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక బీ. క్యాంపులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన పిల్లల హక్కుల కోసం ఎస్టీ కమిషన్ ముందుండి పోరాడుతామని అన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యాక్రమాల కోసం ఆడిటోరియం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ అధికారి రంగ లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మి గురప్ప, ఏఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి, ఎస్టీయు సంఘం నాయకులు మద్దిలేటి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిసిన గౌరు చరిత

● తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతి

కల్లూరు, సెప్టెంబరు 22: పాణ్యం నియోజకవర్గంలో తాగు, సాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సూచించారు. ఆదివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఎమ్మెల్యే గౌరుచరిత స్టేట్‌గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగు అందించాలని కోరారు. కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో హంద్రీనీవా కాల్వద్వారా చెరువులకు నీళ్లు నింపి ప్రజలు, రైతుల తాగు, సాగు నీటి అవసరాలు పరిష్కరించాలని మంత్రిని గౌరుచరిత కోరారు.

శ్రీశైల ముంపు బాధితుల కష్టాలు తీర్చండి



మంత్రి నిమ్మలను సన్మానిస్తున్న నీటి ముంపు నిర్వాసితుల ఔట్ సోర్సింగ్ లస్కర్ల సంఘం నాయకులు

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల ముంపు బాధితుల కష్టాలు తీర్చాలని నీటి ముంపు నిర్వాసితుల ఔట్ సోర్సింగ్ లస్కర్ల సంఘం నాయకులు అన్నారు. ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి తమ సమస్యలను విన్నవించారు. లస్కర్ల సంఘం అధ్యక్షుడు టీ నాగన్న మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి జీవో 98 ప్రకారం రెగ్యులర్ ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. 2011 డిసెంబరు 20న తీసుకొచ్చిన జీవో ఆర్‌టీ నంబరు 735 మేరకు లస్కర్లుగా నియమించారని తెలిపారు. జీవో వచ్చి 37 ఏళ్లయినా ఇప్పటి వరకు 265 మంది లస్కర్లను మాత్రమే రెగ్యులర్ చేశాని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా 500 మంది రెగ్యులర్ కోసం ఎదురు చేస్తున్నారని మంత్రికి వివరించారు. వీరిలో చాలా మందికి వయస్సు మీద పడిందని, ఔట్ సోర్సింగ్ లస్కర్లుగానే పదవీ విరమణ చేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఏకకాలంలో రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



ఆర్ కానాపురంలో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను అందిస్తున్న సుమన్ బాబు

గూడూరు, సెప్టెంబరు 22: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు అన్నారు. ఆదివారం గూడూరు మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన సందర్భంగా సుమన్ బాబు ఆధ్వర్యంలో ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌లను అతికించే కార్యక్రమం చేపట్టారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



దాతలకు ప్రసాదం ఇస్తున్న ఆలయ సిబ్బంది

కౌతాళం, సెప్టెంబరు 22: ఉరుకుంద ఈరన్న శ్రావణ మాస ఉత్సవాల్లో ఆదివారం ఓ భక్తుడు రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. ఆదోని వాస్తవ్యులు మీనాక్షమ్మ తన భర్త లేట్ అలసందగుత్తి సాయినాథ్ రెడ్డి పేరుపై రూ.లక్ష నగదును సూపరిటెండెంట్ మల్లికార్జున స్వామి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి శేషవస్త్రములను, ఫలపుష్పలను అందజేశారు.

పద్య నాటకంలో రాణించడం అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 22: పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతి దూపం తిరుమల తేజ పౌరాణిక పద్య నాటక రంగంలో రాణించడం అభినందనీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో అనంతరంపురానికి చెందిన వేంకటేశ్వర నాట్య మండలి వారిచేత గయోపాఖ్యానం నాటక ప్రదర్శన జరిగింది. ఈ నాటకంలో శ్రీకృష్ణునిగా తిరుమలతేజ, అర్జునుడిగా దూపం రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఒకనాడు పౌరాణిక నాటక రంగంలో జిల్లా పేరును వెల్లుర్తి వెంకటరత్నం నాయుడు మార్మోగించారని, నటులు దూపం రామకృష్ణ తిరుమల తేజ వారి పేరును నిబలబెడుతున్నారని కొనియాడారు. అనంతరం వారిని సత్కరించి రూ.25వేల నగదు పారితోషికం టీజీవీ కళాక్షేత్రం తరుపున అందజేశారు. అనంతరం తిరుమల తేజకు తమ కళాశాలలో బీఎడ్ సీటు ఉచితంగా ఇచ్చి ఆమె చదువుకు ప్రోత్సహిస్తామని విద్యావేత్త అరుణాచలంరెడ్డి ప్రకటించారు. అంతకుముందు తిరుమల తేజ, రామకృష్ణ పాడిన ప్రతి పద్యానికి ప్రేక్షకుల స్పందన లభించింది.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 22: గృహ నిర్మాణ సంస్థలో దీర్ఘకాలికంగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న తమ సేవలను క్రమబద్ధీకరించాలని ఉద్యోగుల ప్రతినిధి వామనగిరి హనుమన్న కోరారు. ఆదివారం ఆయన నగరానికి విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుసేన్ నాయక్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా సంస్థలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ అపరేటర్లు, ఎంఐసీ, అటెండర్లుగా పలు విభాగాల్లో సేవలు అందిస్తున్నమని, తమ సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం టైంస్కేలు వర్కర్లు, ఎన్ఎంఆర్‌లుగా క్రమబద్ధీకరించాలని నివేదించారు. గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు ప్రత్యేకంగా జాబ్ చార్ట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నేనావత్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతి బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22: మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో. 84ను సవరించి వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. గోకారి, జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యాశాఖలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి 84 జీవోను సవరణ చేయాలన్నారు. సర్వీసు నిబంధనలను రూపొందించాలని, అన్ని మేనేజ్‌మెంట్లలో జీవో.117 ప్రకారం బదిలీలు పదోన్నతులు చేపట్టాలని కోరారు. జీవో.117కు అనుగుణంగా ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతుల విలీనం జరిపి మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదని, దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగి ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని అన్నారు.

బలిజ కులస్థుల సమస్యపై మంత్రికి వినతి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 22: రాష్ట్రంలో బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బలిజ సంఘం నాయకులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును కలిసి ఆదివారం వినతి పత్రం అందజేశారు. బలిజ సంఘం నాయకులు రవి, శైలేష్‌లు మాట్లాడుతూ బలిజ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బలిజ సంఘం మహిళలు, నాయకులు ఉన్నారు.

పార్కులో పిచ్చి మొక్కల తొలగింపు



పార్థసారథి నగర్ పార్కులో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 22: నగర శివారు రేడియోస్టేషన్ సమీపంలోని పార్థసారథి నగర్ పార్క్‌లో పట్టణ పౌర సంక్షేమం సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. ఆదివారం కాలనీ ప్రతినిధులు సుకుమార్, వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పార్క్‌ను పరిశీలించి ఆసహనం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి పార్క్‌లకు రక్షణ కంచే ఏర్పాటు చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ధర్మరాజు, పీటర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్టెనోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: జిల్లా టైపిస్ట్ స్టెనోగ్రాఫర్స్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, తిరుమలేశ్వర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం టైపిస్టు స్టెనోగ్రాఫర్ భవన్ అసోసియేషన్ భవన్‌లో జిల్లా టైపిస్టు స్టెనోగ్రాఫర్ల సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో టైపిస్టు స్టెనోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీవీ సభలను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 22: ప్రొద్దుటూరులో ఈ నెల 29న జరగనున్న రాయలసీమ విద్యా వంతుల వేదిక రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు అన్నారు. ఆదివారం నగరంలోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రత్నం ఏసేపు మాట్లాడుతూ రాయలసీమ విద్యావంతుల వేదిక ఏర్పడి 13 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 29న ప్రొద్దుటూరులో స్త్రీశక్తి భవన్‌లో మహాసభలు జరగనున్నాయని అన్నారు. విభజనానంతర రాయలసీమ అనే అంశంపై రోజంతా సదస్సు, ఊరేగింపు, బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ శేషాద్రిరెడ్డి, ప్రజాపరిరక్షణ వేదిక నాయకులు డేవిడ్, రవి, కుల నిర్మూలన పోరాట సమితి బాధ్యులు సుబ్బరాయుడు, కళాకారులు నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.11 లక్షల విరాళం



కురువ సంఘం నాయకులకు విరాళం అందజేస్తున్న దాతలు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22: కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు సమీపం భీమ లింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణం కోసం స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన కురువ లింగారెడ్డి హనుమంతమ్మ దంపతుల కుమారులు రూ.1,11,116 విరాళాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయనిర్మాణం కమిటీ హాలు, విద్యార్థుల ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల సుంకన్న, గుడిసె శివన్న, జిల్లా సహాయ కార్యదర్శి బీసీ తిరుపాలు, ఉపాధ్యక్షులు కే.రాజు పాల్గొన్నారు.

దేవనకొండ సీఐగా వంశీనాథ్

దేవనకొండ, సెప్టెంబరు 22: దేవనకొండ సీఐగా వంశీనాథ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు ఏసీబీ నుంచి దేవనకొండకు బదిలీపై వచ్చారు. సీఐ మాట్లాడుతూ వంశీనాథ్ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడతామని, అసాంఘిక కార్యక్రమాలు, గంజాయిపై ఉక్కుపాదం మొపుతామని హెచ్చరించారు.

స్నేహితుల ఔదార్యం



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

వెల్దుర్తి, సెప్టెంబరు 22: పట్టణంలోని రాణితోటలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ శివరామిరెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు 1996-97లో జడ్పీహెచ్ పాఠశాలలో చదువుకున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు అతనిభార్య హరితకు రూ.72 వేలు ఆర్థికసాయం చేశారు. చిరంజీవి, ఖాజా, నాగరాజు, అయ్యస్వామి, శేషు, వీరేశ్, రహమ్మతుల్లా, మాధవస్వామి, వెంకటేష్, చంద్రశేఖర్, శివకుమార్, రమణ పాల్గొన్నారు.

మోదీ హయాంలో ప్రభుత్వ సంస్థల మూత

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 22: పదేళ్ల మోదీ ప్రభుత్వ హయాంలో 64 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ నాయకుడు గనిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మంగళ ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో కార్మిక నేత సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు తిక్కన్న రెండో వర్ధంతి నిర్వహించారు. గనిరాజు, సుశీలమ్మ, నాగరాజు, కోదండ, శ్రీకాంత్‌రెడ్డి, దస్తగిరి నాయుడు, చెన్నకేశవులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు ఏచూరి



నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 22: దేశం గర్వించదగ్గ నాయకుడు కామ్రేడ్ ఏచూరి అని సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, లౌకిక వాదానికి పోరాడిన విప్లవకారుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రంగారెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు తిరుపాల్, లోక్‌సత్తా నాయకుడు ఆనందాచార్, అశోక్ కుమార్, అరుణ కుమారి, సీపీఎం జిల్లా కమిటి సభ్యులు వీరశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 22: ఈనెల 24వ తేదీ నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నియోజకవర్గ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డి తెలిపారు. ఆదివారం మునిసిపల్ పాఠశాలలో పీఈటీలతో సమావేశమయ్యారు. విద్యార్థులను సిద్ధం చేయాలని, పాఠశాలల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 24న బాలురకు కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్, బాట్మిటన్, 25న బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, బాట్మింటన్ ఉంటాయన్నారు. 9985716006, 9866494372 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ నరసయ్య, రామన్న పాల్గొన్నారు.

సాగు, తాగునీరు ఇవ్వాలి

తుగ్గలి, సెప్టెంబరు 22: హంద్రీనీవా నీటితో చెరువులను నింపి, తుగ్గలి మండలానికి సాగు, తాగునీరు ఇవ్వాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర కోరారు. ఆదివా రం కర్నూలులో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయు డుకు విజ్ఞప్తి చేశారు. మంత్రికి మండల సమస్యలను వివరించినట్లు నాగేంద్ర తెలిపారు.

అవాంఛనీయ ఘటనలు సహించం: డీఎస్పీ

గోనెగండ్ల సెప్టెంబరు 22: మండల కేంద్రంలో నిర్వహించనున్న చింతలముని నల్లారెడ్డి దశమి ఉత్సవాల్లో అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకుంటే జరిగితే సహించేదిలేదని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. అదివారం గోనెగండ్లలోని చింతలముని నల్లా రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

జీహేశ్వర సొసైటీ 25వ వార్షికోత్సవం

ఆదోని టౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని జీహేశ్వర మ్యూచువల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 25వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు కొంగే పంపాపతి మాట్లాడుతూ గత ఏడాది రూ.4.63 లక్షల నికర లాభం వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో సొసైటీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా మశేకార్ మహదేవ, సొసైటీ డైరెక్టర్లు మశేకార్ శ్రీనివాస్, ఈరన్న, అశోక్ కుమార్, శ్రీహరి, లంబాడి నాగరాజు పాల్గొన్నారు.

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు

మంత్రాలయం, సెప్టెంబరు 22: మఠంలో అక్టోబరు 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు మేనేజర్ మాదవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషీ తెలిపారు. మంచాలమ్మ సన్నిధానంలో అమ్మవారిని రోజు ఒక అలంకరణలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు టౌన్,సెప్టెంబరు 22: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఎర్రకోట జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశుభ్రతపై నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. డీఈ నీరజ, ఏఈ మదన్, శ్రీనివాసులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 22: మండలంలోని మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బాస్కెట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బోజరాజు, పీడీ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్-17 విభాగంలో అఖిల, యువరాజ్, అండర్-14లో దినేష్, బెనహర్ రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మారుమూల గ్రామం నుంచి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు నీలకంఠ స్వామి, యుగంధర్, జగదీష్ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొంది జాతీయ స్థాయిలో రాణించి మంత్రాలయం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గుంతల దారి



గుంతలమయంగా ఉన్న బురుజుల-మద్దికెర రహదారి

మద్దికెర- బురుజుల రహదారి గుంతలమయంగా ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిసినా నీరు నిలుస్తుంది. ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
- మద్దికెర

రైతుల కడుపు నింపడానికే భోజనం

- రూ.10 కోట్లతో మార్కెట్ యార్డు అభివద్ధి
- క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ



రైతులకు భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు , సెప్టెంబరు 22: రైతుల కడుపు నింపేందుకే భోజనాన్ని ఏర్పాటు చేశామని, మార్కెట్ యార్డును రూ.పది కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జయనాగేశ్వరెడ్డి అన్నారు. ఆదివారం రైతులకు భోజనం క్యాంటీన్‌ను ప్రారంభించారు. రైతులకు భోజనం వడ్డించి, భోజనం చేశారు. యార్డు అభివృద్ధిపై అమరావతిలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే అన్న క్యాంటీన్లు ప్రారంభించామని రైతుల కడుపు నింపేందుకు ఇస్కాన్ సహకారంతో రూ.15లకే భోజనాన్ని అందజేస్తున్నామని అన్నారు. కోల్డ్ స్టోరేజీ గోడౌన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నియోజకవర్గంలో నాలుగు పీఏసీఎస్‌లు ఉన్నాయన్నారు. గోనేగండ్ల మండలంలో గోనేగండ్ల, హెచ్ కైరవాడిలో గ్రైన్ స్టోరేజీ గోడౌన్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌లో చోరీలు జరగకుండా సెక్యురిటి గార్డుల సంఖ్య పెంపుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే రూ. 15కోట్లతో గురురాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులకు నిధుల మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రతిపాదనలు ఇచ్చామని అన్నారు.

కార్యదర్శి పద్మావతి, నాయకులు మహేంద్ర బాబు, సోమేశ్వర రెడ్డి, మల్లికార్జున, కేశన్న, రఘు, లోకేష్, నరసింహులు, రాముడు, నాగేష్, నవాజ్,జగదీష్,సోడా శీను, కమీషన్ ఏజంట్ల సంఘం నాయకులు జగన్నాథరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, బందా, వ్యాపారులు, ఇస్కాన్ సభ్యులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇది మంచి కార్యక్రమం

రైతులకు రూ.15లకు భోజనం పెట్టడం మంచి కార్యక్రమం. బయట తినాలంటే రూ. వంద కావాలి. - కౌలుట్ల, రైతు, పి.కోటకొండ గ్రామం



కొనసాగించాలి

రైతుల కోసం ఏర్పాటు చేసిన భోజనం క్యాంటీన్‌ను కొనసాగించాలి. ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని క్యాంటీన్‌ను ఏర్పాటు చేయటం సంతోషం. - సుంకన్న, రైతు, ఒంటేడుదిన్నె గ్రామం

బాలుడికి తీవ్ర గాయాలు

కాలుపై వెళ్లిన వాహనం

హొళగుంద, సెప్టెంబరు 22 : మండలంలోని చిన్నహ్యాట గ్రామ శివారులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయప డ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన బాలుడు గోపి రోడ్డు పక్కన నిల్చున్నాడు. బొమ్మ గుండనహళ్లి గ్రామానికి వెలుతున్న బొలేరో ట్రాలీ ఓవైపు వస్తున్న పశువులను తప్పించబోయి రోడ్డుపక్క నిల్చున్న బాలుడి కాలుపైకి ఎక్కింది. గమనించిన వారు బాలుడిని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



బండలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, సెప్టెంబరు 22: సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీలో అక్రమం లేఅవుట్ వేసి బండలు పాతిన వైసీపీ నాయకుడు పులుసు రాజుపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జగనన్న కాలనీలో అక్రమంగా పాతిన బండలను పరిశీలిం చారు. వైసీపీ నాయకుడు పులుసు రాజు 1,700 మెట్రిక్ టన్నుల ఇసుక తరలింపుపై హౌసింగ్ ఏఈ శేఖర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని, ఇంత వరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. కన్వీనర్ జ్ఞానేష్; మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, గాలెం వీరేష్, పోతుల వీరారెడ్డి, బుజ్జి, లక్ష్మిరెడ్డి, రామాంజనేయులు ఉన్నారు.

ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫి కృషి



మాట్లాడుతున్న జాతీయ నాయకుడు నారాయణరెడ్డి

ఎమ్మిగనూరు , సెప్టెంబరు 22: ఎల్ఐజీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫి కృషి చేస్తుందని ఆ సంస్థ జాతీయ సంక్షేమ సంఘం చైర్మన్ నారాయణరెడ్డి, జోనల్ ప్రెసిడెంట్ జంపాల కృష్ణారెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ భారత్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కుర్ణీ కమ్యూనిటి హాల్‌లో లియాఫి నాయకుడు వెంటేశ్వరరెడ్డి అధ్యక్షతన ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ఐసీ స్థిరత్వానికి ఏజెంట్ల వ్యవస్థ తోడ్పడుతుందన్నారు. అనంతరం ఎమ్మిగనూరు శాఖ లియాఫి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బ్రాంచి అధ్యక్షుడిగా పి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా జయన్న, ఆర్థిక కార్యదర్శిగా బి.వీరేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మధుసూదన్ రెడ్డి, సుధాకర్, ప్రభాకర్, మహిళా ప్రతినిధులుగా ఇందిరావతమ్మ, సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కృష్ణ, నీలప్ప, గజేంద్రరెడ్డి, సిద్ధలింగ, రంగస్వామి, రమేష్, ఆంధ్రయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రమాదేవి

తుగ్గలి, సెప్టెంబరు 22: తహసీల్దార్‌గా రమాదేవిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీటీ నాగరాజు ఆదివారం తెలిపారు. సాధారణ ఎన్నికల సమయంలో పరస్పర బదిలీల్లో భాగంగా రమాదవేవి ఇక్కడకు, ఎన్నికలు విధులకు వచ్చిన షర్మిళ తన సొంత జిల్లాకు వెళ్లారని, ఇంతవరకు తాను ఇన్‌చార్జిగా వ్యవహరించానని తెలిపారు.



పాలన గురించి వివరిస్తున్న కూటమి నాయకులు

సంక్షోభంలోనూ సుపరిపాలన

పెద్దకడుబూరు, సెప్టెంబరు 22: ఆర్థిక సంక్షోభంలోనూ సీఎం చంద్రబాబు సుపరిపాలన అందించారని నాయకులు రాఘవేంద్ర రెడ్డి, లక్ష్మణ్, విష్ణు వర్ధన్ అన్నారు. ఆదివారం కంబళదిన్నే గ్రామంలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణకు సంతకం చేయడంతో పాటు ఫించన్ రూ.4వేలు పెంచి అందిస్తున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. పేదలకు అన్నం పెట్టేందుకు అన్న క్యాంటిన్లు తిరిగి ప్రారంబించారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దుచేసి రైతుల్లో ఆనందం నింపారని తెలిపారు. వైసీపి పాపాలతో రాష్ట్రంలో వ్యవస్థలు కుప్పకూలాయిన అన్నారు. రమాకాంత్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, యేసేబు, మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, గణేష్,విజయ్ కూమార్, పురుషోత్తం, శంకర్, భీమేష్ పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలకు ప్రోత్సాహం అవసరం



కళాకారులను సన్మానిస్తున్న టీటీడీ బోర్డు మాజీ మెంబర్ సీతారామిరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 22: సంప్రదాయ నృత్యాలకు ప్రోత్సాహం అవసరమని టీటీడీ మాజీ మెంబరు సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం మంత్రాలయంలోని రివేరా ఫంక్షన్ హాలులో రాఘవేంద్రస్వామికి నాట్యనీరాజనాలు ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ఆర్‌కే కళా సంస్కృతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంజిత్ ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 45 మంది కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భరతనాట్యం, కూచిపూడి, పేరణి, ఆంధ్ర నాట్యం, కవితలు, పద్యాలు, పౌరాణిక ప్రదర్శన, గేయాలు నిర్వహించిన దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారామిరెడ్డి మాట్లాడుతూ పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రోత్సాహించాలన్నారు. అనంతరం కళాకారులను శాలువ, జ్ఞాపిక, పుష్పమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, రిటైర్డు తహసీల్దార్ శర్మ, శ్రీనివాసులు, గుర్రాజు, వెంకటేశ్, వీరేష్, భరణి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, ఆనంద్, జయలక్ష్మి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధికి కృషి: ఎంపీ



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 22: వెనుకబడిన ఆలూరు అభివృద్ధికి కృషి చేస్తామని కర్నూలు ఎంపీ నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు, టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆలూరు అభివృద్ధిలో మీడియా, ప్రజాప్రతినిధులు-అధికారులు పాత్ర అంశంపై సెమినార్ జిల్లా ఉపాధ్యక్షుడు స్వరూప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలూరు వెనుకబాటుకు నీటివనరులు లేకపోవటమే కారణమని అన్నారు. వేదవతి నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలని అన్నారు. వ్యవసాయం కలిసిరాక వలసలు వెల్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశరు. ఎమ్మెల్యే విరుపాక్షి, గుంతకల్ ఎమెల్యే గుమ్మనూరు జయరాం, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ రహదారి పనులను పూర్తిచేసి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి బాపురం రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచుతామని, ఆలూరులో ఎస్ఎస్ ట్యాంకు నిర్మిస్తామని అన్నారు. వేదవతి నిర్మాణం, హంద్రీనీవా తూము, జింకలపార్కు ఏర్పాటుపై తీర్మాణం చేశారు. కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఐజేయూ నాయకులు గోరంట్ల కొండప్ప, నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు గౌడ్, శ్రీనివాసగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, సహాయ కార్యదర్శులు శివ, శ్రీధర్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, చిప్పగిరి మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏరూరు మీనాక్షినాయుడు, ఏపీయూడబ్ల్యూజే ఆలూరు తాలుకా అధ్యక్ష కార్యదర్శులు సురేష్, చంద్రబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కమీషన్లను అరికట్టాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 22: వ్యవసాయ మార్కెట్‌లో అక్రమ కమీషన్లను అరికట్టాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ పట్టణ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ధర్నా నిర్వహించారు. మార్కెట్‌కు మన జిల్లా నుంచే కాక, ఇతర ఇతర జిల్లాలు, తెలంగాణ నుంచి కూడా పంట ఉత్పత్తులను తెస్తున్నారన్నారు. అయితే కొందరు వ్యాపా రులు తమ దుకాణాలకు సరుకులను తెస్తే కమీషన్లు ఇస్తామంటూ ఎర వేసి, రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీజీ విరుపాక్షి, బీజీ చిన్నన్న, బజారి, జబ్బా ర్ మాలిక్, మల్లికార్జున గౌడ్, తిమ్మగురుడు పాల్గొన్నారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



దాతలకు ప్రసాదం ఇస్తున్న ఆలయ సిబ్బంది

కౌతాళం, సెప్టెంబరు 22: ఉరుకుంద ఈరన్న శ్రావణ మాస ఉత్సవాల్లో ఆదివారం ఓ భక్తుడు రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. ఆదోని వాస్తవ్యులు మీనాక్షమ్మ తన భర్త లేట్ అలసందగుత్తి సాయినాథ్ రెడ్డి పేరుపై రూ.లక్ష నగదును సూపరిటెండెంట్ మల్లికార్జున స్వామి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి శేషవస్త్రములను, ఫలపుష్పలను అందజేశారు.

కఠినంగా శిక్షించాలి

మద్దికెర, సెప్టెంబరు 22: భక్తుల మనోభావాలు దెబ్బతీసే వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా కాపు కార్పొరేషన్ అధ్యక్షులు వైపీ వీరన్న డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం దుర్మార్గమని అన్నారు. 50 ఏళ్లుగా టీటీడీకి కేఎంఎఫ్‌కు చెందిన నందిని నెయ్యి సరఫరా చేస్తుంటే.. జగన్ ప్రభుత్వం తమిళనాడు కాంట్రాక్టరుకు అప్పగించిందని అన్నారు. జంతువుల కొవ్వును కలిపారని ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉద్యమాలతోనే సాధ్యం

ఎమ్మిగనూరు టౌన్,సెప్టెంబర్ 22: ఉద్యమాలతో రిజర్వేషన్ సాధ్యమని వాల్మీకి నాయకులు అన్నారు. సోమవారం కర్నూలులో నిర్వహించనున్న వర్క్ షాప్‌కు పుండకూర రంగన్న, నారాయణ, లక్ష్మన్న, యాపులయ్య బయలుదేరారు. నాటి సీఎ నీలం సంజీవయ్య బిసి-ఎగా చేర్చి అన్యాయం చేశారన్నారు. వాల్మీకులు గళం విప్పాలని కోరారు. ఈరన్న, ముక్కన్న, నాగేష్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు మేలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని, సెప్టెంబరు 22: కూటమి పాలనలో ప్రజలకు మేలు కలుగుతోందని టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. ఆదివారం ఆదోని మండలంలోని దొడ్డనగేరి, గణేకల్లు గ్రామాల్లో పర్యటించారు. సీఎం చంద్రబాబు వంద రోజులలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. పింఛన్ల పెంపు ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, డీఎస్సీ నోటిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారన్నారు. సర్పంచ్ శివప్ప, రామస్వామి, బసవరాజు, రామకృష్ణలు పాల్గొన్నారు.

పేలవంగా సాగిన ప్రభుత్వ కార్యక్రమం

ఆదోని టౌన్: పట్టణంలోని మునిసిపల్ మైదానంలో కమిషనర్ అనుపమ అధ్యక్షతన చైర్ పర్సన్, బోయ శాంత ఆధ్వర్యంలో ఆదివారం "ఇదిమంచి ప్రభుత్వం" నిర్వహించారు. అయితే ప్రొటోకాల్ పాటించలేదని టీడీపీ నాయకులు లక్ష్మీ నారాయణ, తిమ్మప్ప, వెంకటేష్ అధికారులతో వాగ్వావాదానికి దిగారు. ప్రభుత్వ పథకాలు, విధీ విధానాల గురించి ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు భూపాల్ చౌదరి, విట్టా రమేష్, కృష్ణమ్మ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజాగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోతే సంక్షోభంలో ఉండి కూడా, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. నాగరాజ్ గౌడ్, న్యాయవాది లోకేష్, బుద్దారెడ్డి, శ్రీనివాస ఆచారి, రంగస్వామి పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రం, కామవరం, కాత్రికి, కరణి, దొమ్మలదిన్నె గ్రామాలలో నిర్వహించారు. కౌతాళంలో తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఉలిగయ్య, వెంకటపతి రాజు, దొమ్మలదిన్నెలో రమేష్‌గౌడ్, షేక్షావలి, కామవరంలో చిన్న తిక్కయ్య, గురురాజ రావు, జాకీర్, నబిసాబ్‌లతో కలసి సతీష్ నాయుడులు, కాత్రికిలో ఎంపీడీఓ సుబ్బరాజు గ్రామ మాజీ సర్పంచ్ చంద్రతో కలిసి ప్రచారం చేపట్టారు.

తుగ్గలి: టీడీపీ ప్రభుత్వంలోనే పేదలు అభివృద్ధి చెందుతారని సర్పంచ్ సుజాత, టీడీపీ నాయకులు రామచంద్ర, మునెప్ప అన్నారు. ఆదివారం ముక్కెల్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి కార్తిక్ రంగనాథ్, బాలు, రాముడు, విద్యా కమిటి చైర్మన్ మల్లికార్జున, ముని తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పలేదు : ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట తప్పలేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం దైవందిన్నె గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.3.50లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏ గ్రామంలో సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తిమ్మాపురం కేటీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ ఆర్లపల్లి మల్లికార్జున, సురేష్ చౌదరి, భూమి రెస్టారెంట్ నర్సన్నగౌడు, మాజీ మండల కన్వీనర్ ఏనుగుబాల రామలింగారెడ్డి పాల్గొన్నారు.